

మూడు రోజుల్లో నివేదిక

సత్తుపల్లి మండలం గంగారం పరిధిలో భూఅక్రమాలపై విచారించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. 18లో



పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు నాయకులు అందజేశారు. 18లో

గరిష్టం / కనిష్టం
34° / 17°

వాతావరణం

గురువారం జిల్లాలో మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. ఉదయం, సాయంత్రం చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

కఠోరశ్రమతోనే లక్ష్య సాధన



కేడెట్లకు పతకాలు అందజేస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: లక్ష్య సాధనకు కఠినంగా శ్రమించడం ద్వారానే ఫలితం ఉంటుందని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలోని శ్రీ కృష్ణప్రసాద్ మెమోరియల్ హైస్కూల్‌ను చైర్ పర్సన్ హృదయ మీనన్‌తో కలసి సీపీ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా సీపీ ఎన్‌సీసీలో ప్రతిభ చూపిన కేడెట్లకు పతకాలు అందజేశాక మాట్లాడారు. పిల్లల అభిరుచులను గుర్తించి ప్రోత్సహిస్తే ఎంచుకున్న రంగంలో రాణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఆర్ఐ రవి పాల్గొన్నారు.

పాత బస్టాండ్ నుండి 'పల్లె వెలుగు'లు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎట్టకేలకు జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుండి పల్లెవెలుగు సర్వీసులు మొదలయ్యాయి. దీంతో నగరానికి రాకపోకలు సాగించే గ్రామీణ ప్రాంత ప్రజలు ఇక్కట్లు తీరనున్నాయి. బుధవారం ఇల్లెందు, బోనకల్ మార్గంలో నాలుగేసి బస్సులు నడిపించగా, పదిహేను సిటీ సర్వీస్ బస్సులు నడిపించారు. గతంలో మెయిన్ గేట్ ద్వారా రాకపోకలు సాగగా, ఇప్పుడు పాత బస్టాండ్ వెనుక గోడ కూల్చడంతో బస్సులు వచ్చివెళ్లడం సులభమైంది. చాన్నాళ్ల తర్వాత పాత బస్టాండ్‌కు ప్రయాణికులు రావటంతో కళ సంతరించుకోగా, రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతామని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

బదిలీ దరఖాస్తులు.. 3,054

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు షెడ్యూల్ ప్రకటించగా, దరఖాస్తు స్వీకరణ గడువు బుధవారంతో ముగిసింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలో రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న 4,212మంది ఉపాధ్యాయులను అర్హులుగా గుర్తించారు. ఇందులో 3,054మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారని అధికారులు వెల్లడించారు. కాగా, ఇప్పటికే ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది.



అటు పూత.. ఇటు కోత!

- కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు ఊరటనిచ్చిన పన్ను మినహాయింపు
- గతంతో పోలిస్తే పల్లెలకు మరిన్ని నిధులు
- వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత నిచ్చినా తగ్గిన కేటాయింపులు
- ఉపాధి నిధులకు కత్తెరతో జిల్లాపై ప్రభావం
- కేంద్ర బడ్జెట్‌పై విపక్షాల పెదవి విరుపు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లాలోని కొన్ని వర్గాలకు ఊరటనిస్తే.. మరికొన్ని వర్గాలను నిరాశకు గురిచేసింది. వేతన జీవుల పన్ను మినహాయింపు గతంతో పోలిస్తే సంతోషాన్నిచ్చింది. ఇక వ్యవసాయ రంగం, ఉపాధికి నిధుల కోతను చూస్తే జిల్లాపై ప్రభావం పడనుంది. ఇక జాతీయ రహదారులు, పల్లెల అభివృద్ధి పథకాల విషయానికి వస్తే నిధుల కేటాయింపు గత బడ్జెట్‌తో పోలిస్తే ఎక్కువగానే ఉంది. దీంతో ఈ రంగాలకు లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా ఉపాధి హామీ పథకం, వ్యవసాయ రంగాన్ని ఈ బడ్జెట్ నిర్వీర్యం చేసిందని బీఆర్ఎస్ ఎంపీలతో పాటు ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పించాయి. కొన్ని రంగాలకు నిధులు కేటాయింపుతో కనికరిస్తే.. మరికొన్ని ప్రాధాన్యత రంగాలకు కోత పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉద్యోగులకు లబ్ధి

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని పెంచడంపై జిల్లాలోని ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆదాయపు పన్ను పరిమితిని రూ.7లక్షలకు పెంచారు. ఉద్యోగుల పన్ను శాబ్‌లను ఆరు నుంచి ఐదుకు తగ్గించారు. దీంతో జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన సుమారు 15 వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. పెరిగిన ధరల దృష్ట్యా పన్ను మినహాయింపు కొంత మేర ఆదుకున్నట్లేనని ఉద్యోగుల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వ్యవ'సాయం' తగ్గినట్టే..

జిల్లా వ్యాప్తంగా 3.16 లక్షల మంది రైతులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ప్రతీ సీజన్‌లో ఎకరాకు రూ.5 వేలు ఇస్తోంది. అయితే గతంలో ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలకు ఇస్తున్న సబ్సిడీలు అందడం లేదని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈమేరకు కేంద్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే గతంత కంటే ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించినా నిధుల్లో కోత పెట్టింది. దాదాపు 22 శాతం నిధులు కోత విధించడంతో ఈ రంగంపై ప్రత్యక్షంగా ప్రభావం పడనుంది.

'ఉపాధి' కుదింపే..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 6,92,793 మంది కూలీలు నమోదయ్యారు. వేసవిలో వేతనం పెంచడంతోపాటు అడిగిన ప్రతీ కూలీకి పని కల్పిస్తున్నారు. గతంలో ఈ పథకానికి నిధుల కేటాయింపు బాగానే ఉన్నా.. ఈసారి కేంద్రం రూ.29 వేల కోట్లకు పైగా కోత విధించింది. ఈ పరిణామంతో జిల్లాలోని కూలీలకు పనిదినాలు తగ్గనున్నాయి. అంతేకాకుండా పనికి తగినట్లు వేతనం అందే పరిస్థితి ఉండదన్న విమర్శలు వస్తున్నాయి. కష్ట జీవుల పని పథకానికి నిధులు తగ్గించడంపై అధికార బీఆర్ఎస్‌తోపాటు ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి.

పల్లెలకు చేయూత

కేంద్రం గ్రామీణ ప్రాంతాల కోసం అమలు చేస్తున్న పథకాలను పరిశీలిస్తే బడ్జెట్‌లో నిధులు పెంచింది. జిల్లాలో 589 గ్రామపంచాయతీలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వ నిధులు కూడా పంచాయతీలకు విడతల వారీగా అందుతున్నాయి. స్వచ్ఛ భారత్, తాగునీటి పథకాలు, వైద్యం, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన వంటి అంశాలకు సంబంధించి నిధుల కేటాయింపు ఈసారి పెరిగింది. ఈ నిధులు సక్రమంగా పల్లెలకు అందితే రూపురేఖలు మారనున్నాయి.

కేంద్రానిది రైతు వ్యతిరేక వైఖరి



ఇది రైతు, గ్రామీణ, పేదల, తెలంగాణ వ్యతిరేక బడ్జెట్. రైతులను పూర్తిగా విస్మరించింది. విభజన హామీల అమలులోనూ నిర్లక్ష్యం వహించారు. రైల్వే ప్రాజెక్టుల్లోనూ అన్యాయమే జరిగింది. నీతి ఆయోగ్‌కు సిఫారసు చేసిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలకు కూడా నిధులు ఇవ్వలేదు. సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తెలంగాణపై చూపుతున్న వివక్షతకు కేంద్రం మూల్యం చెల్లించక తప్పదు.

– నామ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేత

ఒక్క వైద్య కళాశాల లేదు..



కేంద్రం గతంలో 157 వైద్యకళాశాలలను మంజూరు చేస్తే ఒక్కటీ తెలంగాణకు ఇవ్వలేదు. ఇప్పుడు నర్సింగ్ కళాశాలలు ఇస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నా అందులోనూ తెలంగాణకు అన్యాయమే జరిగింది. జిల్లాకో నవోదయ పాఠశాల, బయ్యారం స్టీల్‌ప్లాంట్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీల విషయాన్ని ప్రస్తావించలేదు. సాగునీటి ప్రాజెక్టులపై కనికరం చూపలేదు. బడ్జెట్‌తో ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే లబ్ధి జరుగుతుంది.

– వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు

రామాలయంలో వైభవంగా 'భీష్మ ఏకాదశి'

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బుధవారం భీష్మ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పల్లకీ సేవగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. ఈఓ శివాజీ దంపతులు స్వామివారికి పూలు, పండ్లు సమర్పించగా, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, విష్ణు సహస్రనామార్చన గావించి హారతి సమర్పించారు.



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు



శాంతినగర్ పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అజయ్, పక్కన కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ తదితరులు

- జిల్లాలో రూ.120 కోట్లతో అభివృద్ధి
- రెండు పాఠశాల భవనాలను ప్రారంభించిన మంత్రి పువ్వాడ

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. మన బస్తీ – మన బడి పథకం ద్వారా ఎంపిక చేసిన నగరంలోని మామిళ్లగూడెం ప్రాథమిక పాఠశాల, శాంతినగర్ ఉన్నత పాఠశాలల భవనాల్లో పనులు పూర్తికాగా, బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతినగర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అజయ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి కార్యక్రమాన్ని చేపట్టగా, జిల్లాలో 426 పాఠశాలలు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈమేరకు తొలిదశలో చేపట్టిన 31పాఠశాలలకు గాను మామిళ్లగూడెం పాఠశాలకు రూ.12.49లక్షలు, శాంతినగర్ పాఠశాలకు రూ.1.14కోట్లు కేటాయించి పనులు చేయించామని వెల్లడించారు. ఇప్పటికే ఆంగ్ల బోధన అందుతుండగా, మరో వైపు వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే, డిజిటల్ తరగతులు తదితర సౌకర్యాలతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సర్కార్ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య మరింత పెరుగుతుందని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు.



శాంతినగర్ పాఠశాలలో డిజిటల్ బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

రూ.120కోట్లతో పనులు

కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ మన ఊరు –మన బడి, మన బస్తీ –మన బడి కింద జిల్లాలో 426 పాఠశాలలను ఎంపిక చేసి పనులు ప్రారంభించగా.. 60పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ..20 కోట్లు మంజూరు చేసిందన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్న నేపథ్యాన విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, డీసీఎంఎస్, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, విజయ్, అదనపు కలెక్టర్ స్నేహలత, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంగులు వేస్తేనే ప్రమాణాలు పెరగవు

- సరిపడా సిబ్బందిని నియమించేలా టీచర్లూ పోరాడాలి
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

బోనకల్: పాఠశాలల భవనాలకు రంగులు వేసినంత మాత్రాన విద్యాప్రమాణాలు పెరగవని.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించినప్పుడే అది సాధ్యమవుతుందని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మండలంలోని ఆళ్లపాడు లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన పాఠశాల భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడా బోధనా సిబ్బంది ఉంటేనే ఫలితాలు వస్తాయని తెలిపారు. ఇసుకలో అక్షరాలు దిద్దిన కాలం నుండి డిజిటల్ క్లాస్ రూంల వరకు చేరుకున్న నేపథ్యాన విద్య, వైద్యం అనేవి ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ఆళ్లపాడు పాఠశాలలో విద్యార్థులకు అటు తెలుగు, ఇటు ఇంగ్లిష్ మీడియం ఏకకాలంలో బోధిస్తుండడంతో నష్టమే తప్ప లాభం ఉండదని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు హక్కుల సాధనతో పాటు సరిపడా బోధనా సిబ్బంది నియామకం కోసం పోరాడాలని భట్టి సూచించారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ఎందరు వస్తున్నారో అంతేమంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తుండడాన్ని పరిశీలిస్తే ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేకపోవడమే కారణమని.. ఈ విషయంలో అందరూ ఆలోచన చేయాలన్నారు. కాగా, తన నిధుల నుండి పాఠశాలలకు రూ.కోటిన్నర నిధులు కేటాయించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుమాధవ్, డీటీ శ్వేత, ఎంఈఓ ప్రభాకర్, సర్పంచ్ మర్రి తిరుపతిరావు, ఎంపీటీసీ శ్రీదేవి, ఎస్ఎంసీ చైర్మన్ కందుల పాపారావు తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లపాడు పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న భట్టి విక్రమార్క

వైరా కౌన్సిలర్ల భేటీ!

- నిధుల్లో ఆలస్యంపై అసహనం
- 16మంది హాజరు.. ఇద్దరు గైర్హాజరు

వైరా: మున్సిపాలిటీ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోవడం లేదని, మూడేళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలపై పంపించిన ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదని వైరా మున్సిపల్ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్ ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా వైరా సమీపాన ఓ మామిడి తోటలో బుధవారం కౌన్సిలర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు వారి అభిప్రాయాలు వెల్లడించారు. మున్సిపాలిటీ ఏర్పడి మూడేళ్లు గడవగా, 2018లో మంజూరైన రూ.20 కోట్ల నిధులు మినహా ఇప్పటి వరకు నిధులు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. ఇక రూ.30 కోట్ల పనులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా, నిధుల విడుదల విషయమై స్థానిక ఎమ్మెల్యే రాములునాయక్ కృషి చేయడం లేదని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. వార్డుల్లో ఇకనైనా అభివృద్ధి జరగకపోతే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని పలువురు వెల్లడించినట్లు తెలిసింది. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములుతో పాటు 16 మంది కౌన్సిలర్లు హాజరుకాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

చింతకాని: మండలంలోని నాగులవంచలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను అసిస్టెంట్ కలెక్టర్ రాధికా గుప్తా బుధవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించాక కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. అలాగే, దళితబంధు యూనిట్ల గ్రౌండింగ్, మన ఊరు–మన బడి పనులపై సూచనలు చేశారు. ఆతర్వాత ఆరోగ్య ఉపకేంద్రం, రేషన్‌షాపులను సందర్శించి సేవలపై ఆరా తీశారు. సర్పంచ్ ఆలస్యం నాగమణి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మంగీలాల్, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కేంద్రంగా తెలంగాణ

- రైతుకు వెన్నుదన్నుగా నిలిచింది సీఎం కేసీఆరే
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి
- ఘనంగా ఖమ్మం మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం
- హాజరైన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పక్కన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, తాత మధు, మేయర్ నీరజ తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులతో దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే తెలంగాణ మొదటి స్థానం దక్కించుకుని, ఉపాధి కేంద్రంగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం మార్కెట్ ఆవరణలో బుధవారం జరగగా, మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశాక మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు. నిరంతరాయంగా పరిశ్రమలు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడంతో పారిశ్రామిక వృద్ధి జరగడమే కాక పుష్కలంగా పంటలు పండుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు వసతులు లేక, పంటలు లేక కళ తప్పిన వ్యవసాయ మార్కెట్లు నేడు కళకళలాడుతున్నాయని చెప్పారు. పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేది లేదని కేంద్రప్రభుత్వం చేతులెత్తేసినా తెలంగాణ ప్రభుత్వం ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులకు వెన్నుదన్నుగా నిలిచిందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో రైతుబంధు ద్వారా గత ఐదేళ్లలో రూ.65 కోట్ల మేర రైతులకు పెట్టుబడి సాయం అందించామని వివరించారు. తెలంగాణ వ్యవసాయం దేశానికే మోడల్ కాగా.. ఈర్ష్యతో మోదీ రాష్ట్రంపై అన్ని రంగాల్లో వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు.

రైతులకు అండగా నిలుస్తా..

మార్కెట్ చైర్‌పర్సన్‌గా వచ్చిన అవకాశాన్ని రైతులకు సేవ చేసేందుకు ఉపయోగిస్తానని దోరేపల్లి శ్వేత తెలిపారు. రైతుల్లో ఒకరిగా ఉంటూ రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన ఖమ్మం మార్కెట్‌ను అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. తొలుత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లుగా శ్వేత, షేక్ అఫ్జల్‌లతో కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, తాతా మధు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్, డిప్యూటీ మేయర్ ఫాతిమా, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, నాయకులు చిన్ని కృష్ణారావు, చెరుకూరి కృష్ణమూర్తి, పులిపాటి ప్రసాద్, మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, నున్నా మాధవరావు, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, వీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం మార్కెట్ చైర్మన్‌పర్సన్ దోరెపల్లి శ్వేత సహా పాలకవర్గం బుధవారం ఉదయం మార్కెట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సర్వమత ప్రార్థనలు చేశాక చైర్‌పర్సన్ శ్వేత మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ ఆశీస్సులతో రైతుల ప్రయోజనాల కోసం శక్తి మేరకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, డైరెక్టర్లతో పాటు మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు పెద్దపీట : పువ్వాడ

రైతులకు గిట్టుబాటు ధర, పంట కొనుగోళ్లలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వరంగల్ ఏనుమాముల మార్కెట్‌తో పోటీ పడుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఇక్కడి మార్కెట్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు ఆంధ్రప్రదేశ్, సూర్యాపేట జిల్లాల నుంచి కూడా రైతులు పంటలు అమ్మకానికి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ మార్కెట్ పదవుల్లో రిజర్వేషన్ కల్పించడం వల్ల పదవులు బడుగు, బలహీన వర్గాలకు దక్కుతున్నాయన్నారు. ఇప్పటికే ఖమ్మం నియోజకవర్గంలో మేయర్, మార్కెట్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్, జెడ్పీటీసీతో పాటు కార్పొరేటర్ పదవుల్లోనూ మహిళలకే పెద్దపీట వేసినట్లు చెప్పారు. తన బిడ్డ లాంటి శ్వేత చైర్‌పర్సన్ పదవి ద్వారా రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని సూచించారు. రాబోయే రోజుల్లో అన్ని వర్గాలకు పదవులు దక్కుతాయని మంత్రి చెప్పారు.



చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ అఫ్జల్‌ను సన్మానించిన మంత్రి పువ్వాడ

స్వచ్ఛతలో జిల్లా ఫస్ట్ !

- దేశవ్యాప్తంగా 'త్రీ స్టార్' కేటగిరీలో అవకాశం
- భద్రాద్రి జిల్లాకు ఐదో స్థానం

ఖమ్మంమయూరిసెంటర్: 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్'లో జనవరి నెలకు సంబంధించి ఖమ్మం జిల్లా త్రీ స్టార్ కేటగిరీలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే ద్వారా ఏటా గ్రామాలకు అవార్డులు ఇచ్చేది. అయితే, ఈసారి కేటగిరీల్లో మార్పులు చేసి, ప్రతినెలా గుర్తింపు ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా జనవరికి సంబంధించి ఖమ్మం జిల్లా దేశంలోనే ప్రథమంగా నిలిచినట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోని 589 గ్రామపంచాయతీలను అధికారులు పల్లె ప్రగతి, పారిశుధ్య నిర్వహణ పనులు మెరుగుపరుస్తూనే బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలను తీర్చిదిద్దుతున్నారు. ఇంకా కంపోస్ట్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు, గొర్రెల పాకల నిర్మాణం, ఇంటింటా చెత్త సేకరణ, మొక్కలు నాటి సంరక్షిస్తుండడంతో గ్రామాలు శుభ్రంగా మారుతున్నాయి.

అలాగే, చేపడుతున్న పనులపై అధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండగా, జనవరి నెలకు జిల్లా దేశంలో మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రకటించారు. ఇక ఇదే కేటగిరీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐదో స్థానం దక్కించుకుంది. కాగా, రెండు, మూడు, నాలుగో స్థానాల్లో మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ జిల్లా, కేరళలోని కొట్టాయం, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలు నిలిచాయని కేంద్రం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.

క్లుప్తంగా

అదుపుతప్పి పల్టీ కొట్టిన టిప్పర్

నేలకొండపల్లి: జాతీయ రహదారి నిర్మాణ పనులకు మట్టి తరలిస్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది. కోదాడ – కురవి జాతీయ రహదారి నిర్మాణ పనుల నిమిత్తం మండలంలోని కోనాయిగూడెం సమీపాన ర్యాంప్ నుంచి టిప్పర్లతో బుధవారం మట్టి తరలిస్తుండగా, ర్యాంపు నుంచి టిప్పర్‌ను నేలకొండపల్లి వైపు మళ్లించే క్రమంలో అదుపుతప్పి పల్టీలు కొడుతూ పాలంలో బోల్తా పడింది. ప్రమాదాన్ని గుర్తించి డ్రైవర్ కిందకు దూకటంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయాన రహదారిపై ఆటోలు, బైక్‌లు వెళ్తున్నప్పటికీ ఎవరికీ ఏం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం గాయపడిన డ్రైవర్‌కు నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి ఖమ్మం తరలించగా, టిప్పర్‌ను నాలుగు క్రేన్ల సాయంతో బయటకు తీశారు.

ఐ మిస్ యూ డాడీ

వాట్సప్ మెసేజ్ పంపి విద్యార్థి అదృశ్యం


జశ్వంత్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: నగరంలోని దానవాయిగూడెంనకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి యలమందల జశ్వంత్ ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. జశ్వంత్ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా, చికిత్స చేయించినా తగ్గలేదు. మంగళవారం సాయంత్రం ఆయన తన తండ్రి ఫోన్ వాట్సప్‌కు 'నాన్న నేను ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నాను. కడుపునొప్పి భరించలేకపోతున్నాను. ఐ మిస్ యూ డాడీ'అని మెసేజ్ పంపాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అబుదాబీలో వైరా బాలుడు మృతి


చంద్రహాస్ (ఫైల్)

వైరా: అబుదాబీ దేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వైరాకు చెందిన బాలుడు మృతి చెందాడు. వైరాలోని సుందరయ్యనగర్‌కు చెందిన సింగు నాగేశ్వరరావు కుమారుడు రాజేశ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అబుదాబీలో పదేళ్లుగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య ఇందిర, కుమారుడు చంద్రహాస్‌తో కలిసి అక్కడే స్థిరపడ్డాడు. గత నెల 29న ఇంటి ముందు ఆవరణలో చంద్రహాస్ సైకిల్ తొక్కుకుంటూ రోడ్డుపైకి వెళ్లగా కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో చంద్రహాస్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు బాలుడి మృతదేహంతో బుధవారం వైరాకు చేరుకోగా బంధువులు, స్థానికుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తిచేశారు.

రెండు వర్గాల మధ్య పరస్పర దాడులు

నేలకొండపల్లి: పంట చేలో గొర్రెలు మేసిన ఘటనపై ఇరువర్గాలవారు పరస్పరం దాడులు చేసుకోగా.. పోలీసులు చేరుకుని చెదరగొట్టారు. స్థానికుల కథనం ప్రకారం.. నేలకొండపల్లికి చెందిన రామారావు పొలంలో ఇటీవల వినోద్‌కు చెందిన గొర్రెలు పంట మేశాయి. ఈ విషయమై రామారావు దాడికి దిగగా, ప్రతిగా వినోద్ బంధువులు రామారావుపై దాడి చేసినట్లు ఆరోపిస్తున్నారు. బుధవారం ఇరువర్గాల పెద్దల సమక్షాన పంచాయితీ నిర్వహించగా, భారీగా తరలివచ్చిన వారి నడుమ మాటమాట పెరగడంతో దాడులు చేసుకున్నారు. రహదారిపై ఈ గొడవ జరుగుతుండటంతో పోలీసులు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

బైండోవర్ ఉల్లంఘన కేసులో రూ.లక్ష జరిమానా

తిరుమలాయపాలెం: గుడుంబా కేసులో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి తహసీల్దార్ బుధవారం రూ.లక్ష జరిమానా విధించారు. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చిలక్కోయలపాడుకు చెందిన మేకల పెద్దవెంకన్న గతంలో గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా బైండోవర్ కేసు నమోదు చేశారు. కానీ వెంకన్న మళ్లీ గుడుంబా అమ్ముతూ పట్టుబడడంతో రూ.లక్ష జరిమానా విధిస్తూ తహసీల్దార్ పుల్లయ్య ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం ఆయన నుంచి నగదు వసూలు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ జయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని రైతుబంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో 30 మందికి మంజూరైన రూ.14,75,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఖమ్మంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అమలుచేయని పథకాలను సీఎం కేసీఆర్ అమలుచేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ శకుంతల, నాయకులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, ఉమాశంకర్, పోట్ల శ్రీను, చిత్తారు సింహాద్రి యాదవ్, బత్తుల శ్రీనివాసరావు, చింతలచెర్వు లక్ష్మి, బాలాజీ, కుమార్, డేరంగుల బ్రహ్మం, శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన ఎస్‌పీఎల్

- సీనియర్స్ విభాగంలో.. ఉత్కంఠగా సాగిన క్వార్టర్ ఫైనల్స్
- నేడు సెమీస్ మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు


సాయిస్ఫూర్తి - విజయ ఇంజనీరింగ్ కళాశాల జట్ల మధ్య మ్యాచ్

ఖమ్మంస్పోర్ట్స్: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్ కంపెనీ సౌజన్యంతో జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు సీనియర్స్ విభాగంలో సెమీస్ దశకు చేరాయి. నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా బుధవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. పలు కళాశాలల క్రీడాకారులు గెలుపు కోసం హోరాహోరీగా పోటీ పడ్డారు. కాగా, ఎస్‌బీఐటీ–1, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, బొమ్మ ఫార్మసీ కళాశాల–ఖమ్మం, విజయ ఇంజనీరింగ్ కళాశాల–ఖమ్మం, వికాస్ డిగ్రీ కళాశాల–ఖమ్మం జట్లు క్వార్టర్ ఫైనల్ దశలో పోటీ పడగా.. గురువారం సెమీస్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మ్యాచ్‌లను 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహన్‌కృష్ణ, కేయూ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం కార్యదర్శి డాక్టర్ బి.వెంకన్న ప్రారంభించగా, సాక్షి ఈవెంట్ మేనేజర్ బోడపట్ల వేణు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజు, ఆర్సీ ఇన్‌చార్జ్ నెల్లూరి ఉపేందర్‌తో పాటు జుజ్జూరు ఉపేందర్, ఆసిఫ్, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు ఇలా...

■ సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల (సత్తుపల్లి) – విజయ ఇంజనీరింగ్ కళాశాల(ఖమ్మం) జట్ల మధ్య మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సాయిస్ఫూర్తి జట్టు నిర్ణీత ఓవర్లలో 53 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన విజయ ఇంజనీరింగ్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 54 పరుగులతో విజయం సాధించింది.

■ కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల (ఖమ్మం) – కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల(పాల్వంచ) జట్ల నడుమ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన కవిత జట్టు నిర్ణీత ఓవర్లలో 57 పరుగులు చేసింది. ఆ తర్వాత కేఎల్ఆర్ జట్టు 51 పరుగులే చేయడంతో ఓటమి పాలైంది.


కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల జట్టు


విజయ ఇంజనీరింగ్ జట్టు


ఎస్‌బీఐటీ-1 కళాశాల జట్టు

■ ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల (ఖమ్మం) – డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల (ఖమ్మం) జట్ల మధ్య మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న డీఆర్ఎస్ జట్టు 52 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్‌బీఐటీ జట్టులో ఓపెనర్లు ఇద్దరే సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించారు.

■ వికాస్ డిగ్రీ కళాశాల (ఖమ్మం) – బ్రౌన్స్ ఫార్మసీ కళాశాల (ఖమ్మం) జట్ల మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వికాస్ జట్టు 58 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్రౌన్స్ జట్టు ఆశించిన స్థాయిలో పరుగులు చేయకపోవడంతో ఓటమి పాలైంది.

■ ఎస్‌బీఐటీ–1 ఇంజనీరింగ్ కళాశాల (ఖమ్మం) – అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల(కొత్తగూడెం) జట్ల మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన అబ్దుల్ కలాం జట్టు 64 పరుగులు చేసింది. ఆ తర్వాత ఎస్‌బీఐటీ–1 జట్టు లక్ష్యాన్ని అవలీలగా ఛేదించి విజయం సాధించింది.


ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల జట్టు

■ ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల (ఖమ్మం) – కవిత డిగ్రీ కళాశాల (ఖమ్మం) జట్ల మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ జట్టు పరిమిత ఓవర్లలో 64 పరుగులు చేయగా, ఆ తర్వాత కవిత జట్టు 57 పరుగులే చేయగలగడంతో ఓటమి పాలైంది.

■ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల (సత్తుపల్లి) – గీతాంజలి డిగ్రీ కళాశాల (ఖమ్మం) జట్ల నడుమ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన మదర్ థెరిస్సా కళాశాల జట్టు 111 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ జట్టులో సుజీవ్ 40, ప్రవీణ్ 24 పరుగులు చేశారు. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన గీతాంజలి డిగ్రీ కళాశాల జట్టు 44 పరుగులే చేయడంతో పరాజయం ఎదురైంది.

■ అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల (కొత్తగూడెం) – ఆర్జేసీ డిగ్రీ కళాశాల (ఖమ్మం) జట్ల నడుమ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్జేసీ డిగ్రీ కళాశాల జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 50 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అబ్దుల్ కలాం కళాశాల జట్టు సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ బుధవారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు, ఆదాయ పన్ను మినహాయింపు, కోతలు తదితర అంశాలపై జిల్లా నేతలు స్పందించారు. బీజేపీ నేతలు బడ్జెట్ అద్భుతంగా ఉందని కొనియాడగా.. బీఆర్ఎస్, వామపక్షాల నేతలు మాత్రం పెదవి విరిచారు. ఈ సందర్భంగా బడ్జెట్‌పై నేతలు అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. –ఖమ్మం మయూరిసెంటర్/ ఖమ్మం సహకారనగర్/ ఖమ్మం మామిళ్లగూడెం

తెలంగాణకు ప్రత్యేక ప్రకటనలేమీ లేవు



బడ్జెట్‌లో తెలంగాణకు ప్రత్యేక ప్రకటనలు ఏమీ లేకపోగా, పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల ప్రస్తావన లేదు. తెలంగాణ నుంచి బీజేపీకి నలుగురు ఎంపీలు ఉన్నా ఏప్రయోజనం చేకూరలేదు. ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్. కర్ణాటకలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రూ.5,300 కోట్లు, గుజరాత్ ఎన్నికల సందర్భంగా ఆ రాష్ట్రానికి నిధులు ఇచ్చారు. కానీ తెలంగాణలో పాలమూరు, కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టుల్లో దేనికీ జాతీయ హోదా ఇవ్వలేదు.
– తాత మధు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ

కలలను ఛిద్రం చేశారు..



నిరుద్యోగులు, రైతులు, మధ్య తరగతి వర్గాల కలలను ఛిద్రం చేసేలా బడ్జెట్ ఉంది. కేవలం ఇది కార్పొరేట్ వర్గాలను మాత్రమే సంతృప్తి పరుస్తుంది. దేశంలో కీలకమైన వ్యవసాయ రంగానికి తగిన కేటాయింపులు లేకపోగా, రైతుల ఆత్మహత్యలను అరికట్టేలా పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరపై ఊసెత్తకపోవడం సరికాదు. ఇక నల్ల చట్టాల రద్దుపై ప్రకటన చేయలేదు. రాష్ట్రంలో బయ్యారం ఉక్కు కర్మాగారం, ఇతర ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు ప్రస్తావనే చేయలేదు.
– పోటు రంగారావు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి

రాష్ట్రానికి మొండి చేయి



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపారు. సామాన్య, మధ్య తరగతి ప్రజల బతుకులను ఛిద్రం చేసేలా, కార్పొరేట్లను సంతృప్తి పరిచేలా బడ్జెట్ ఉంది. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న ఏ అంశాన్ని ప్రస్తావించలేదు. ఆదాయ పన్ను పరిమితిని రూ.7 లక్షలకు బదులు రూ.10 లక్షలకు పెంచితే బాగుండేది. బయ్యారం ఉక్కు కర్మాగారం, ఇతర ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు లేకపోగా, రైల్వే లైన్, కోచ్ ఫ్యాక్టరీని విస్మరించడం గర్హనీయం.
– పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు

సవాళ్లకు సమాధానం లేని బడ్జెట్



అంకెల్లో ఘనంగా ఉన్నా.. కేటాయింపుల్లో తిరోగమనం దిశగా పయనించేలా బడ్జెట్ ఉంది. రాష్ట్రం, జిల్లాకు కొత్త ప్రతిపాదనలేమీ లేకపోగా గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. ఆర్థిక వ్యవస్థ ఘనంగా ఉందని చెబుతూనే ఆకలి బాధితులకు అన్న యోజన కొనసాగిస్తామని చెప్పడం గర్హనీయం. మధ్య, చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమలకు రెండుశాతం పన్ను మినహాయింపు ఇవ్వడం కంటితుడుపు చర్యే. కార్పొరేట్లకు మాత్రం పది శాతం తగ్గించడాన్ని గుర్తించాలి.
– నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి

రైతులు, పేదలకు మేలు చేసేలా బడ్జెట్



కేంద్ర బడ్జెట్ రైతులు, పేదలతో పాటు వ్యాపారులకు మేలు చేసేదిగా ఉంది. వ్యవసాయ రంగానికి రూ.20 లక్షల కోట్లు రుణంగా మంజూరు చేస్తామని ప్రకటించడం కేంద్రప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. ఇక మహిళలు, బాలికల కోసం సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, మహిళల కోసం అధిక వడ్డీ, దళితుల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టడమే కాక నిరుద్యోగులకు అండగా ఉండేలా పథకాలు ప్రవేశపెడతామని ప్రకటించడం శుభపరిణామం.
– గల్లా సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కార్పొరేట్ అనుకూల బడ్జెట్



బడ్జెట్ పేదలు, రైతాంగానికి వ్యతిరేకంగా.. కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా ఉంది. ఆర్థిక అసమానతలను తగ్గించడానికి బదులు పెంచేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుంది. సామాన్యులకు లాభం లేకపోగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల ప్రస్తావనే లేదు. ఆర్థిక మంత్రి చేసిన ప్రసంగం, కేటాయింపులకు పొంతన లేకుండా ఉంది. ఈ బడ్జెట్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు లేకపోగా మరింత దిగజార్చే విధంగా ఉండడం బాధాకరం.
– బాగం హేమంతరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు

మూడురోజుల్లో నివేదిక ఇవ్వండి..

- గంగారం భూములపై కలెక్టర్ గౌతమ్ ఆదేశం
- భూములను పరిశీలించిన ఆర్డీఓ


బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర

సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లి: 'మీ పాస్ పుస్తకంలో మిగులు భూమి ఉంది.. తహసీల్‌కు వచ్చి కలిస్తే మిగులు భూమి తీసి తహసీల్దార్ కొత్త పాస్ పుస్తకం ఇస్తారన్నారు. అక్కడకు వెళ్లగానే ఆపరేటర్ వేలిముద్ర వేయమని చెప్పారు.. ఆ తర్వాత చూసుకుంటే నా పేరు మారింది'అని సత్తుపల్లి మండలం గంగారానికి చెందిన భూబాధితుడు ముత్తా వెంకటేశ్వర్లు వాపోయారు. ఈ మేరకు సత్తుపల్లి పర్యటనకు బుధవారం వచ్చిన కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ గౌతమ్ మూడురోజుల్లోగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణను ఆదేశించారు. గంగారంలోని బేతుపల్లి సర్వే నంబర్ 133లో అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని బాధితులు చెప్పగా, విచారణ పూర్తయ్యే వరకు భూములను హోల్డ్‌లో పెట్టాలని కలెక్టర్ సూచించారు.

రంగంలోకి ఆర్డీఓ

సత్తుపల్లి మండలం గంగారం గ్రామం బేతుపల్లి సర్వే నంబర్ 133లో జరిగిన అక్రమాలపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలు, బాధితుల ఫిర్యాదుతో విచారణాధికారిగా కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణను కలెక్టర్ నియమించారు. దీంతో బుధవారం ఆయన గంగారంలో పర్యటించగా పలువురు బాధితులు కలిసి మాట్లాడారు. లాక్కున్న భూములను వేర్వేరు సర్వే నంబర్లు, రెవెన్యూ అధికారుల సహకారంతో రెగ్యులర్ చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. విచారణ జరుగుతోందని తెలియడంతో ఫెన్సింగ్, సీసీ కెమెరాలు తీసివేశారని చెప్పారు. ఈ మేరకు మేడిశెట్టివారిపాలెం వరకు భూములను పరిశీలించిన ఆర్డీఓ.. త్వరలోనే కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని తెలిపారు.

సత్తుపల్లిలో కలెక్టర్ పర్యటన

సత్తుపల్లిలోని ఎన్టీఆర్ కాల్వ పక్కన ఉన్న భూములకు సంబంధించి మ్యాప్‌లను కలెక్టర్ వీపీ గౌతమ్ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి పరిశీలించారు. ఇది అటవీశాఖకు చెందిన భూమి కాదని.. గతంలో ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉండేదని ఎమ్మెల్యే చెప్పారు. ఈ మేరకు భూమిని అభివృద్ధి పనులకు కేటాయించాలని కోరారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలించిన కలెక్టర్.. పనులు ఆలస్యం అవుతుండటంతో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, తామరచెరువు వద్ద ఉన్న పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది ఫౌంటెన్‌ను ఏర్పాటు చేయాలని, బతుకమ్మ ఘాట్‌ను అభివృద్ధి చేయాలని, గాడిదవాగు పరిధిలో ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు.

టీటీడీ ఆధ్వర్యాన కంఠస్థ పోటీలు


పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన బుధవారం విద్యార్థులకు విష్ణు సహస్ర నామం, అచ్యుతాష్టకం కంఠస్థ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అచ్యుతాష్టకం విభాగంలో ఇంగువ లక్ష్మీధీమహి (చైతన్య హైస్కూల్), ఇంగువ శశిరేఖఅకుల్(ఫస్ట్ స్టెప్స్ స్కూల్), ఎస్‌కే నైఫా (శ్రీరామకృష్ణ విద్యాలయం) మొదటి మూడు బహుమతులు గెలుచుకోగా, విష్ణు సహస్ర నామం పోటీల్లో శ్రీవల్లి వాగ్దేవి (శ్రీ వివేకానంద విద్యాలయం), కిరణ్మయి హిరణ్మయి, టి.మోహిత్‌కృష్ణ (శ్రీ గోర్కీ పబ్లిక్ స్కూల్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా కె.సురేఖ, వి.వెంకటేశ్వర్లు, భువన విజయం వ్యవహరించగా, చతుర్వేదుల సత్యనారాయణ, కీసర జైపాల్‌రెడ్డి, కె.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

కుమారుడి నిశ్చితార్థ వేళ విషాదం


శ్రీనివాసరావు (ఫైల్)

పెనుబల్లి: ఓవైపు ఇంట్లో కుమారుడి నిశ్చితార్థ వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.. ఇంతలోనే తండ్రి గుండెపోటుతో మృతి చెందిన ఘటన పెనుబల్లి మండలం యడ్లబంజర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొమ్మకంటి శ్రీనివాసరావు(49) తన కుమారుడి వివాహం కోసం నిశ్చితార్థానికి బుధవారం ఏర్పాట్లు చేశారు. ఇంతలోనే తెల్లవారుజామున శ్రీనివాసరావు గుండెపోటుకు గురికావడంతో కుటుంబీకులు పెనుబల్లి ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు.

కాల్వలో పడి మహిళ మృతి

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన మహిళ ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుగుణ (50) బట్టలు ఉతికేందుకు కాల్వ వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయింది. దాదాపు కి.మీ. మేర కొట్టుకుపోగా స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు అమ్మగూడెం సమీపాన ఉన్న నందిగామ బ్రాంచ్ కెనాల్ యూటీ వద్ద ఆగిన ఆమెను బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను బుధవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో తనిఖీలు చేపట్టగా అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ మంగీలాల్ వెల్లడించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాలేరులో షర్మిల గెలుపు ఖాయం

వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు రామచంద్రరావు, రాంరెడ్డి


మాట్లాడుతున్న గట్టు రామచంద్రరావు, పక్కన రాంరెడ్డి, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్ టీపీ నుంచి ముఖ్యమంత్రి అభ్యర్థిగా వైఎస్.షర్మిల పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు గట్టు రామచంద్రరావు, పిట్టా రాంరెడ్డి వెల్లడించారు. ఖమ్మంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌టీపీ ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్ని రాజకీయ పార్టీలు ఏకమైనా పాలేరులో షర్మిల గెలుపును ఎవరూ అడ్డుకోలేరన్నారు. షర్మిల గెలుపు కోసం పాలేరులో గడపగడపకు పార్టీని తీసుకెళ్లేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో పలువురికి పార్టీ పదవులు ఇవ్వడమే కాక, పార్టీ ఇక్కడ బలంగా ఉండడంతోనే పాలేరు నుంచి పోటీ చేయాలని షర్మిల నిర్ణయించుకున్నారని తెలిపారు. కాగా, బీఆర్ఎస్, బీజేపీలు ఓ పార్టీ కోసం ఇంకొకటి పనిచేస్తున్నాయని వారు విమర్శించారు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గడిపల్లి కవిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ఏపూరి సోమన్న, నీలం రమేష్, జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు, ఖమ్మం అసెంబ్లీ నియోజవకర్గ ఇన్‌చార్జ్ తుంపాల కృష్ణమోహన్‌తో పాటు రవీంద్రరెడ్డి, బానోత్ సుజాత, దొంతమాల కిషోర్ కుమార్, మద్దెల ప్రసాద్, తుమ్మా అప్పిరెడ్డి, మేకమల్ల సందీప్, కంది వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 ప్రపంచకప్ విజేత జట్టుకు బీసీసీఐ సన్మానం

ఐసీసీ తొలిసారి నిర్వహించిన అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా సభ్యులను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం అహ్మదాబాద్‌లో ఘనంగా సన్మానించింది. న్యూజిలాండ్‌తో ఆఖరి టి20 పోరుకు ముందు జరిగిన ఈ వేడుకలో బోర్డు ప్రకటించిన రూ. 5 కోట్ల నజరానాను భారత దిగ్గజం సచిన్ చేతుల మీదుగా అండర్-19 జట్టు కెప్టెన్ షఫాలీ వర్మ అందుకుంది. అమ్మాయిలు అద్భుతంగా రాణించారని కితాబిచ్చిన 'మాస్టర్'... ఈ ఘనతతో మరెంతో మంది మహిళా క్రికెటర్ల కలలకు ఊపిరి పోశారని అన్నారు.





గిల్

గిల్ జిగేల్...

- భారత ఓపెనర్ మెరుపు సెంచరీ
- ఆఖరి టి20 పోరులో టీమిండియా 168 పరుగులతో విజయం
- కివీస్‌పై 2–1తో సిరీస్ సొంతం

అహ్మదాబాద్: మోదీ స్టేడియంలో భారత్ పరుగుల మోత మోగించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (63 బంతుల్లో 126 నాటౌట్; 12 ఫోర్లు, 7 సిక్సర్లు) తన బ్యాటింగ్ సునామీని చూపించాడు. దీంతో ఆఖరి టి20లో టీమిండియా 168 పరుగుల భారీ తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి 2–1తో సిరీస్ గెలుచుకుంది. మొదట భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. రాహుల్ త్రిపాఠి (22 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరిపించాడు. అనంతరం న్యూజిలాండ్ 12.1 ఓవర్లలో 66 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' హార్దిక్ పాండ్యా నాలుగు వికెట్లు తీశాడు.

గిల్ విధ్వంసం

ఇషాన్ కిషన్ (1) రెండో ఓవర్లోనే నిష్క్రమించగా... గిల్, త్రిపాఠి కివీస్ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగారు. రెండో వికెట్‌కు ఈ జోడీ మెరుపులతో 7 ఓవర్ల వ్యవధిలోనే భారత్ 80 పరుగులు చేసింది. తర్వాత సూర్యకుమార్ (13 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్సర్లు) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా క్రీజులోకి రాగా... 15 ఓవర్లలో భారత్ స్కోరు 156/3. శుబ్‌మన్ 44 బంతుల్లో 67 పరుగులతో ఉన్నాడు. గిల్ అప్పటిదాకా ఒక ఆట, 16వ ఓవర్ నుంచి మరో ఆట ఆడాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడిన గిల్... లిస్టర్, టిక్నర్, ఫెర్గూసన్ ఎలా ఎవరెదురైనా... బంతుల్ని అదేపనిగా బౌండరీ దాటించాడు. పాండ్యా ఆడిన బంతుల్ని మినహాయిస్తే... గిల్ 16 బంతులను వరుసగా 0, 6, 6, 1, 6, 4, 0, 6, 1, 4, 6, 1, 4, 1, 4, 6లుగా ధనాదంచేశాడు. దీంతో 4 ఓవర్లలోనే భారత్ 72 పరుగులు చేసింది. ఇందులో 56 పరుగులు గిల్‌వే! ఈ క్రమంలో 54 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఆఖరి ఓవర్లో పాండ్యా (17 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) అవుట్‌కాగా కేవలం 6 పరుగులే వచ్చాయి.

భారత్ పేస్‌కు కివీస్ బ్యాటర్స్ వణికారు. మూడో ఓవర్లోనే కివీస్ 7 పరుగులకే 4 వికెట్లను కోల్పోవడంతో భారత్ విజయానికి బాటపడింది. మిచెల్, సాన్‌ట్నర్ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.



సిరీస్ ట్రోఫీతో కెప్టెన్ హార్దిక్

126 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత క్రికెటర్‌గా శుబ్‌మన్ గిల్ (126 నాటౌట్) గుర్తింపు పొందాడు. కోహ్లి (122 నాటౌట్; అఫ్గానిస్తాన్‌పై 2022 లో) పేరిట ఉన్న రికార్డును గిల్ సవరించాడు.

168 అంతర్జాతీయ టి20ల్లో పరుగుల తేడా పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం. 2018లో ఐర్లాండ్‌పై 143 పరుగుల తేడాతో సాధించిన విజయం రెండో స్థానానికి వెళ్లింది.

5 భారత్ తరఫున మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20లు) సెంచరీ సాధించిన ఐదో క్రికెటర్‌గా గిల్ నిలిచాడు. గతంలో రైనా, కేఎల్ రాహుల్, రోహిత్, కోహ్లి ఈ ఘనత సాధించారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బ్రేస్‌వెల్ 1; గిల్ (నాటౌట్) 126; త్రిపాఠి (సి) ఫెర్గూసన్ (బి) సోధి 44; సూర్యకుమార్ (సి) బ్రేస్‌వెల్ (బి) టిక్నర్ 24; పాండ్యా (సి) బ్రేస్‌వెల్ (బి) మిచెల్ 30; హుడా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 234.**
వికెట్ల పతనం: 1-7, 2-87, 3-125, 4-228.
బౌలింగ్: లిస్టర్ 4-0-42-0, బ్రేస్‌వెల్ 1-0-8-1, ఫెర్గూసన్ 4-0-54-0, టిక్నర్ 3-0-50-1, ఇష్ సోధి 3-0-34-1, సాన్‌ట్నర్ 4-0-37-0, మిచెల్ 1-0-6-1. **న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** అలెన్ (సి) సూర్య (బి) పాండ్యా 3; కాన్వే (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్ 1; చాప్‌మన్ (సి) ఇషాన్ (బి) అర్ష్‌దీప్ 0; ఫిలిప్స్ (సి) సూర్య (బి) పాండ్యా 2; మిచెల్ (సి) మావి (బి) ఉమ్రాన్ 35; బ్రేస్‌వెల్ (బి) ఉమ్రాన్ 8; సాన్‌ట్నర్ (సి) సూర్య (బి) మావి 13; ఇష్ సోధి (సి) త్రిపాఠి (బి) మావి 0; ఫెర్గూసన్ (సి) ఉమ్రాన్ (బి) పాండ్యా 0; టిక్నర్ (సి) ఇషాన్ (బి) పాండ్యా 1; లిస్టర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (12.1 ఓవర్లలో ఆలౌట్) 66. వికెట్ల పతనం:** 1-4, 2-4, 3-5, 4-7, 5-21, 6-53, 7-53, 8-54, 9-66, 10-66. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 4-0-16-4, అర్ష్‌దీప్ సింగ్ 3-0-16-2, ఉమ్రాన్ మాలిక్ 2.1-0-9-2, కుల్దీప్ యాదవ్ 1-0-12-0, శివమ్ 2-0-12-2.

ఆంధ్ర 379 ఆలౌట్

ఎడమచేతి వాటంతో బ్యాటింగ్ చేసిన విహారి



విహారి

ఇండోర్: డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 127.1 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు ఆటలో ఆంధ్ర కెప్టెన్ హనుమ విహారి (27; 3 ఫోర్లు) చేతి గాయంతో బాధపడుతున్నా జట్టు అవసరాలరీత్యా ఎడమచేతి వాటం బ్యాటింగ్ చేయడం హైలైట్‌గా నిలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 144 పరుగులు చేసింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్ మరో 235 పరుగులు వెనుకంజలో ఉంది. ఆంధ్ర బౌలర్లలో శశికాంత్ రెండు వికెట్లు తీయగా... నితీశ్ కుమార్ రెడ్డి, పృథ్వీరాజ్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 262/2తో ఆట కొనసాగించిన ఆంధ్ర ఒకదశలో 323/2తో పటిష్టంగా కనిపించింది. అయితే సెంచరీ పూర్తి చేసుకున్న కరణ్ షిండే (110; 12 ఫోర్లు, 2 సిక్సులు)... రికీ భుయ్ (149; 18 ఫోర్లు, 1 సిక్స్) ఐదు పరుగుల తేడాలో అవుటయ్యాక ఒక్కసారిగా ఆంధ్ర ఇన్నింగ్స్ కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఆంధ్ర జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 353/9గా నిలిచింది. ఈ దశలో తొలి రోజు ఆటలో గాయపడి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ హనుమ విహారి క్రీజులోకి వచ్చాడు. చేతి గాయాన్ని లెక్కచేయకుండా తన సహజశైలి కుడిచేతి వాటం బదులుగా ఎడమచేతి వాటంతో విహారి బ్యాటింగ్ చేసి ఔరా అనిపించాడు. చివరి వరుస బ్యాటర్ లలిత్ మోహన్ (22 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి హనుమ విహారి 26 పరుగులు జోడించి సారాంశ్ జైన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగడంతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

జాతీయ స్కూల్స్ చెస్‌లో తెలంగాణకు ఏడు పతకాలు



యశ్వి జైన్

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్కూల్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు ఏడు పతకాలు లభించాయి. ఇందులో ఐదు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం ఉన్నాయి. అండర్-15 బాలుర విభాగంలో వేముల అద్వైత్ విఘ్నేశ్ (7.5 పాయింట్లు)... అండర్-15 బాలికల విభాగంలో యశ్వి జైన్ (7 పాయింట్లు)... అండర్-13 బాలుర విభాగంలో చల్లా సహర్ష (8 పాయింట్లు)... అండర్-11 బాలికల విభాగంలో మోదిపల్లి దీక్షిత (7.5 పాయింట్లు)... అండర్-9 బాలికల విభాగంలో పుంగవనం సంహిత (8 పాయింట్లు) పసిడి పతకాలు గెలిచారు. అండర్-7 బాలుర విభాగంలో ఆదుళ్ల దివిత్ రెడ్డి (7.5 పాయింట్లు) కాంస్యం, అండర్-7 బాలికల విభాగంలో బోగా వంశిక (7 పాయింట్లు) రజతం సాధించారు. పతకాలు సాధించిన వారికి నెలనెలా భారత గ్రాండ్‌మాస్టర్ ఎం.శ్యామ్‌సుందర్‌తో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ ప్రకటించారు.

ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్ 21-13, 21-14తో మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో కిరణ్ జార్జి (భారత్) 21-17, 19-21, 23-21తో చెయుక్ యి లీ (హాంకాంగ్)ను ఓడించాడు. అయితే భారత్‌కే చెందిన సమీర్ వర్మ, ప్రియాన్షు రజావత్, మిథున్ మంజునాథ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రియాన్షు 21-14, 19-21, 25-27తో హియో క్వాంగ్ హీ (దక్షిణ కొరియా) చేతిలో... సమీర్ వర్మ 14-21, 16-21తో లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో.. మిథున్ 18-21, 12-21తో నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ జోడీ 21-11, 21-16తో టై అలెగ్జాండర్-జోసెఫిన్ వు (కెనడా) ద్వయంపై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

సినిమా



రజనీకాంత్

జైసల్మేర్‌లో జైలర్

రాజస్థాన్‌లోని జైసల్మేర్‌కు వెళ్లారు 'జైలర్'. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్'. రమ్యకృష్ణ, తమన్నా, శివరాజ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో మోహన్‌లాల్ ఓ అతిథి పాత్ర చేస్తున్నారు. ఇటీవలే చెన్నైలో ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న 'జైలర్' చిత్ర యూనిట్ ఇప్పుడు 'జైసల్మేర్'కు చేరుకుంది. ఈ షూటింగ్‌లో పాల్గొనడానికి ఆల్రెడీ రాజస్థాన్‌లో ల్యాండ్ అయ్యారు రజనీకాంత్. ఈ షెడ్యూల్ దాదాపు రెండు వారాలు జరగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్ – మోహన్‌లాల్‌పై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారని సమాచారం. ఇక ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలయ్యే అవకాశం ఉంది.

హెలికాప్టర్‌లో షూటింగ్‌కి...

హెలికాప్టర్‌లో షూటింగ్ లొకేషన్‌కు వెళుతున్నారు కమల్‌హాసన్. 1996లో హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'ఇండియన్ 2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కడపలోని గండికోట విలేజ్‌లో జరుగుతోంది. తిరుపతి నుంచి గండికోట లొకేషన్‌కు రోజూ హెలికాప్టర్‌లో వెళ్తున్నారు కమల్‌హాసన్. కాగా కమల్ హెలికాప్టర్ రైడ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి, కాల్షీట్స్, షూటింగ్ సమయం వృథా కాకుండా చూసేందుకు కమల్ ఇలా హెలికాప్టర్ రైడ్ చేస్తున్నారన్నది కోలీవుడ్ టాక్. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్‌సింగ్, బాబీ సింహా కీ రోల్స్ చేస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.



కమల్‌హాసన్

పల్లెటూరి ప్రేమ

పార్వతీశం, జశ్విక జంటగా వైభవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసా.. మనసా..'. వర్షా ముందాడ, మాధవి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను 'దిల్' రాజు విడుదల చేశారు. వైభవ్ మాట్లాడుతూ– ''ఓ గ్రామంలో బెలూన్స్ అమ్ముకునే మల్లిబాబు (పార్వతీశం), అదే ఊర్లో పనిచేసే హెల్త్ అసిస్టెంట్ సుజాత (జశ్విక)ను ప్రేమిస్తాడు. అయితే సుజాతకు మల్లిబాబు దూరం కావాల్సి వస్తుంది. ఆ తర్వాత వారిద్దరూ కలుసుకున్నారా? లేదా అనేది చిత్ర కథ'' అన్నారు. ''న్యూ ఏజ్ లవ్ స్టోరీ చిత్రమిది'' అన్నారు వర్షా ముందాడ, మాధవి.



'శశివదనే'లో ఓ దృశ్యం

ఆ పేరుని తెరపై చూడాలనుకున్నా!

- శౌరి చంద్రశేఖర్ టి. రమేష్

''మా నాన్న చంద్రశేఖర్‌గారు ప్రతివారం నన్ను ఏదో ఒక సినిమాకి తీసుకెళ్లేవారు. అలా చిన్నతనంలోనే సినిమాలపై ఇష్టం మొదలైంది. మా నాన్నగారు చనిపోయాక ఆయన పేరుని నా పేరులో పెట్టుకున్నాను. ఆ పేరుని తెరపై చూడాలనే నా కోరిక 'బుట్టబొమ్మ' ద్వారా తీరుతుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శౌరి చంద్రశేఖర్ టి. రమేష్. అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'బుట్టబొమ్మ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న విడుదల కానుంది. ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమవుతున్న చంద్రశేఖర్ టి.రమేష్ మాట్లాడుతూ– ''రామ్ గోపాల్ వర్మ గారి కార్పొరేషన్‌లో పని చేశాను. ఈశ్వర్ నివాస్‌గారు దర్శకత్వం వహించిన నాలుగు హిందీ సినిమాలకు పని చేశాను. ఆ తర్వాత సుకుమార్‌గారి వద్ద 'జగడం' నుంచి 'పుష్ప' సినిమా వరకు పని చేశాను. మలయాళ మూవీ 'కప్పేల'ని సితార వారు రీమేక్ చేస్తున్నారని తెలిసి, నేనే సంప్రదించాను. 'కప్పేల'లోని మెయిన్ పాయింట్ తీసుకొని తెలుగు నేటివిటీకి తగ్గట్లు 'బుట్టబొమ్మ'లో మార్పులు చేశాం. ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది'' అన్నారు.



శౌరి చంద్రశేఖర్



విజయ్, త్రిష

పదిహేనేళ్ల తర్వాత....

దాదాపు పదిహేనేళ్ల తర్వాత జోడీ కట్టారు హీరో విజయ్– హీరోయిన్ త్రిష. మహేశ్‌బాబు 'ఒక్కడు' తమిళ రీమేక్ 'గిల్లి' (2004)లో తొలిసారి జోడీ కట్టారు విజయ్, త్రిష. ఆ తర్వాత 'తిరుపాచ్చి'(2005), (తెలుగులో 'అన్నవరం'గా రీమేక్ అయ్యింది) తెలుగు 'అతనొక్కడే'కు తమిళ రీమేక్ 'ఆది' (2006), 'కురివి' (2008) సినిమాల్లో జంటగా నటించారు. తాజాగా విజయ్ కెరీర్‌లో 67వ చిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ ప్రకటించింది. దీంతో విజయ్, త్రిష ఐదోసారి స్క్రీన్ షేర్ చేసుకున్నట్లవుతుంది. 'మాస్టర్' తర్వాత హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. సంజయ్ దత్, ప్రియా ఆనంద్, అర్జున్ సర్జా, గౌతమ్ మీనన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్.

వింతగా మారబోతోంది

తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో భరత్ కుమార్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ, శ్రీనివాస్ కౌశిక్, సాయికృష్ణ గద్వాల్, విజయ్ కుమార్ నిర్మిస్తున్న చిత్రం 'కీడా కోలా'. ఎనిమిది ప్రధాన పాత్రలతో ఈ మూవీ రూపొందుతోంది. వారిలో బ్రహ్మానందం ఒక కీలక పాత్ర చేస్తున్నారు. బుధవారం బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 'మీ ప్రపంచం వింతగా మారబోతోంది' అని పోస్టర్‌పై క్యాప్షన్ ఇచ్చారు. ''ప్రతి ఇంట్లో ఉండే తాత పాత్రలో (వరదరాజు) బ్రహ్మానందంగారు కనిపిస్తారు'' అన్నారు తరుణ్ భాస్కర్.



బ్రహ్మానందం

తెరపైకి జాక్సన్ జీవితం

పాప్ సంగీత సామ్రాజ్యానికి రాజుగా వెలిగిన మైఖేల్ జాక్సన్ జీవితంతో 'మైఖేల్' పేరుతో బయోపిక్ రూపొందనుంది. ఈ చిత్రానికి ఆంటోయిన్ ఫుక్వా దర్శకుడు. మైఖేల్‌గా ఆయన సోదరుడు జెర్మైన్ కుమారుడు జాఫర్ జాక్సన్ నటించనున్నారు. వెండితెరపై యాక్టర్‌గా జాఫర్‌కు ఇదే తొలి చిత్రం. ''మా అంకుల్ కథలో నటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను'' అన్నారు జాఫర్. ''మైఖేల్ జాక్సన్ లక్షణాలు జాఫర్‌లో చాలా ఉన్నాయి. మైఖేల్‌గా నటించగల ఒకే ఒక్క వ్యక్తి జాఫర్ అని నమ్ముతున్నాను'' అన్నారు నిర్మాతల్లో ఒకరైన గ్రాహం. ఇక 1958 ఆగస్టు 29న పుట్టిన మైఖేల్ జాక్సన్ 2009 జూన్ 25న మరణించిన విషయం తెలిసిందే.



మైఖేల్



జాఫర్

లవ్.. యాక్షన్



రక్షిత్, కోమలి

రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ జంటగా సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శశివదనే'. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శరవణ వాసుదేవన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'శశివదనే..' టైటిల్ సాంగ్‌ని డైరెక్టర్ హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటని హరిచరణ్, చిన్మయి శ్రీపాద పాడారు. ''లవ్, యాక్షన్ డ్రామాగా రూపొందిన చిత్రమిది'' అన్నారు సాయి మోహన్. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చోలేటి, కెమెరా: సాయికుమార్.

అయోమయంలో...



రణధీర్, శుభశ్రీ

రణధీర్, శుభశ్రీ జంటగా ఊర శ్రీను దర్శకత్వంలో 'అయోమయంలో అరవింద' సినిమా ఆరంభం అయింది. డాక్టర్ ప్రసాద్ మూరెళ్ల సహకారంతో లెక్కల మహేంద్రా రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి వి. శ్రీనివాసరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్ కొట్టారు. మేడిది వెంకటేశ్వరరావు గౌరవ దర్శకత్వం వహించారు. ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది'' అన్నారు ఊర శ్రీను. ''ఇప్పటివరకు వచ్చిన కథలకు భిన్నంగా మా చిత్రకథ ఉంటుంది'' అన్నారు మహేంద్రా రెడ్డి. ''ఈ చిత్రంలో మంచి సందేశం ఇస్తున్నాం'' అన్నారు ప్రసాద్ మూరెళ్ల. ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్, సంగీతం: శివ కాకాని.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 371/A/AA, Thanikella Village, Konijerla Mandal, Khammam Dist - 507 305, T.G., and Printed at Jagati Publications Limited, Survey No. 371/A/AA, Thanikella Village, Konijerla Mandal, Khammam Dist - 507 305, T.G., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08742-282823 - 24, Fax No.08742 - 282825, RNI Regn No. TEL TEL/2008/23797.